క్లుప్తంగా

రగ్బీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి భరత్ రగ్బీ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు శీను, యామిని, మునిలక్ష్మి, అనిత, అశ్విని ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తులకు అన్నదానం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరాలయంలో శనివారం రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక శివకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు చంద్రమోహన్‌రెడ్డి భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వ్యర్థ మొక్కల తొలగింపు



జేసీబీతో మొక్కల తొలగింపు

నారాయణవనం: మండలంలోని ప్రఖ్యాత పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన కైలాసనాథకోనలో వ్యర్థ మొక్కలను తొలగిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాలకు జాతీయ రహదారి నుంచి కైలాసనాథకోన జలపాతం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులకు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్తీక, ధనుర్మాసాలలో కోనకు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. పర్యాటకులు, భక్తులకు ఇబ్బందులు లేకుండా దారి పొడవునా, జలపాత సమీపంలో మొక్కలను జేసీబీ సాయంతో తొలగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు,

నేడు రాజ్యాంగ దినోత్సవం

పిచ్చాటూరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఆదివారం పండుగలా జరపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రాల్లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు.

పాస్టర్ భౌతికకాయానికి నివాళి

మండలంలోని నీరువాయికి చెందిన పాస్టర్ కుమార్ శ్వాశకోస వ్యాధితో శనివారం ఉదయం మరణించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం మధ్యాహ్నం ఆయన ఇంటికి చేరుకొని, కుమార్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లింగ వివక్షను తరిమికొడదాం



ర్యాలీలో మాట్లాడుతున్న ఏవో గుణశేఖర్

నారాయణవనం: లింగ వివక్షను తరిమికొట్టాలని పలువురు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ లింగ వివక్ష నిర్మూలనా దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు లింగ వివక్ష, హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో గుణశేఖర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళలను గౌరవించి, గుర్తింపు ఇవ్వడం ప్రతి ఒక్కరికి బాధ్యతని తెలిపారు. ఏపీఎం మమత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పరిపుష్టిని సాధించడానికి గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ పనిచేస్తోందన్నారు. స్వయం ఉపాధికి బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలను మహిళా సంఘాలకు అందిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, ఎంఈవో గోవిందస్వామి, ఏపీవో సుకన్య, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, సీసీ నాగేంద్ర, సంఘమిత్రలు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

తిరుపతి అర్బన్: చట్టాలు, హక్కులపై మహిళలు అవగాహన ఉండాలని ప్రజా సాధికారిక ట్రస్ట్ సభ్యుడు దేవేంద్రకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని బేరివీధి ఎంసీయూపీ స్కూల్‌లో బాలల హక్కుల పరిరక్షణ వారోత్సవాలను ఎస్‌ఓఎస్ విలేజ్ ఇండియా వారి సహకారంతో నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శైలజ మాట్లాడుతూ దిశా చట్టం ద్వారా ప్రభుత్వం మహిళలకు కల్పించిన భద్రతా అంశాలను వివరించారు. అనంతరం నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బాలాజి, సురేష్, పుష్పలత పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రభంజనం

- సత్యవేడు నియోజకవర్గంలో విజయవంతమైన జగనన్న ఆరోగ్య సురక్ష
- 34,109 మందికి అందిన వైద్యసేవలు
- 33,178 మందికి ఉచితంగా మందుల పంపిణీ
- ఇలాంటి మేలు ఎప్పుడూ లేదన్న గ్రామీణులు





వరదయ్యపాళెం : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ

దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం మంచి ఫలితాలను ఇచ్చింది. సత్యవేడు నియోజకవర్గంలోని 90 సచివాలయాల్లో నిర్వహించిన శిబిరాల్లో 34,109 మంది వైద్యం పొందారు. 33,178 మంది మందులు అందుకున్నారు. 1757 మంది చిన్న పిల్లలకు కంటి పరీక్షలు, రక్తహీనత తదితర పరీక్షలు నిర్వహించారు. క్యాంపుల్లో 4078 మందికి కంటి పరీక్షలు చేసి 1,560 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు.

సత్యవేడు నియోజకవర్గ వివరాలు

మండలం	సచివాలయాలు	ఓపీ	వైద్యం	మందులు తీసుకున్న పిల్లలు	కంటి పరీక్షలు చేసుకున్నవారు	కంటి అద్దాలు పొందిన వారు
వరదయ్యపాళెం	11	5988	265	5988	898	330
సత్యవేడు	17	4579	151	4742	504	173
బీఎన్‌కండ్రిగ	11	5123	546	5123	353	299
కేవీబీపురం	19	4108	194	3014	313	72
నారాయణవనం	11	6767	239	6767	539	164
పిచ్చాటూరు	10	2947	76	2947	742	316
నాగలాపురం	11	4597	286	4597	729	206
మొత్తం	90	34109	1757	33178	4078	1560

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లారు. ఇంటి వద్ద లేకపోతే పొలం గట్లకు వెళ్లి ఆరోగ్యపరీక్షలు చేశారు. జల్లెడ పట్టి రోగులను గుర్తించి ప్రతిఒక్కరికీ వైద్యసేవలు అందించారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఇంటికికీ వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతిఒక్కరికీ నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి



వరదయ్యపాళెం: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్(ఫైల్)

ఉచితంగా మందులను అందజేశారు. మెరుగైన వైద్యం కోసం మరికొందరిని జిల్లా ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేశారు. సత్యవేడు నియోజకవర్గంలోని 90 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో మొత్తం 34,109 మంది వైద్యం పొందారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, కంటికి సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, దగ్గు, తలనొప్పి, ఇతరత్రా జబ్బులకు పరీక్షలు చేయించుకుని, సుమారు 33,178 మంది మందులు అందుకున్నారు. ఈ వైద్య శిబిరాలు వ్యాధుల గుర్తింపునకు ఎంతో ఉప యోగపడ్డాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటి వద్దకే వైద్యం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు తామంతా రుణపడి ఉంటామని గ్రామీణ ప్రజలు స్పష్టం చేశారు.

బీపీ, షుగర్ బయట పడింది



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నాకు ఎంతగానో ఉపయోగపడింది. వైద్యులు వివిధ రకాల రక్త, మూత్ర పరీక్షలు చేసి బీపీ, షుగర్ ఉందని నిర్ధారించారు. తక్షణమే ఆ రెండు జబ్బులకు ఉచితంగా మందులను అందజేశారు. ఆహార నియమాలను వివరించారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

–డి. నాగమ్మ, సంతవేలూరు

జల్లెడ పట్టాం



జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించాం. ఇళ్ల వద్ద లేని వారి కోసం రెండు, మూడు పర్యాయాలు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించాం. ఈ నూతన విధానం ద్వారా అనేక మంది బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించాం. వారందరికీ మందులను పంపిణీ చేసి గ్రామస్థాయిలో ఉండే వైద్యసిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద ఇంటి వద్దకే మందులను సైతం పంపిణీ చేస్తున్నాం. –లావణ్య, వైద్యాధికారిణి, చిన్న పాండూరు పీహెచ్‌సీ

విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. 12 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్యుల ద్వారా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రోగులను గుర్తించి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు కొంతమందిని సిఫార్సు చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశాం.

–సుబ్రమణ్యం రాజు, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

కల్యాణ వెంకన్న జల విహారం



తెప్పపై ఉభయ దేవేరులతో విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: మండల కేంద్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంలోని ప్రసిద్ధ శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగురోజు శనివారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో ఏకాంతంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. శనివారం కావడంతో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేషాభరణాలతో అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. మేళతాళాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా పద్మసరస్సు వద్దకు వేంచేపు చేశారు. సరస్సులో జలాలకు సంప్రోక్షణ తదితర పూజలను నిర్వహించి విద్యుత్ దీపాలు, పచ్చటి మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఉత్సవర్లను అధిష్టింప చేశారు. సరస్సులో తెప్పపై ఐదు ప్రదక్షిణలు స్వామి,అమ్మవార్లు జల విహారం చేశారు. స్వామి,అమ్మవార్లను దర్శించి భక్తులు తరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం, ఏకాంత సేవ నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు శ్రీదేవి,భూదేవి సమేతంగా..

తెప్పోత్సవాలలో చివరి రోజు ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి తెప్పపై జల విహారం చేయనున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పద్మసరస్సు గట్టుపై నేతి దీపాలను వెలిగించాలని, సరస్సు నీటిలో వదలకూడదని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య విజ్ఞప్తి చేశారు.

రాహు–కేతు పూజలకు పోటెత్తిన భక్తులు



రాహుకేతు పూజా మండపాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శని త్రయోదశి కావడతో రాహు–కేతు పూజలకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం చర్యలు తీసుకుంది. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు వేర్వేరుగా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. పాలకమండలి చైర్మన్ రూ.500 రాహుకేతు పూ జా మండపాన్ని తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దళారీలపై నిఘా పెట్టాలని సూచించారు. అదే విధంగా కంచు గడప వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా దర్శనానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ఏర్పేడు: మండలంలోని కందాడు ఎస్సీ కాలనీకి చెందిన బోనాసి భాస్కర్ కుటుంబానికి శనివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి రూ.10 వేలు సాయం చేసి చేయూత నిచ్చారు. భాస్కర్(47) అయ్యప్ప మాల ధరించి శబరిమల వెళ్లి, గురువారం రాత్రి గుండెపోటుతో పంబ సమీపంలో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహం శబరిమల నుంచి శనివారం స్వగ్రామానికి చేరుకుంది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సర్పంచ్ శ్రీదేవి, మాజీ సర్పంచ్ వీరారాఘవరెడ్డి, నాయకులు రాంబత్తెయ్య, పరందామరెడ్డి, పారి నాగరాజు, యల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పిచ్చాటూరులో బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి
- పిచ్చాటూరులో చివరి గడప గడపలో ఎమ్మెల్యే ఆదిమూలం



ఎమ్మెల్యే చేతికి ముద్దు పెడుతున్న మహిళ

పిచ్చాటూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ప్రజలకు మేలు జరగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శనివారం పిచ్చాటూరు సచివాలయ పరిధిలోని శేషంపేట, పిచ్చాటూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద నియోజకవర్గంలోని 7 మండలాల్లోని 700 గ్రామాలు తిరిగి ప్రతి కుటుంబాన్ని కలుసుకునే అవకాశం కలిగిందని తెలిపారు. సమస్యలను తెలుసుకుని సచివాలయానికి ప్రభుత్వం అందించే రూ.20 లక్షలతో పరిష్కరించినట్లు పేర్కొన్నారు. టూటౌన్ వీధులకు సిమెంటు రోడ్డు, కాలువల నిర్మాణానికి గడపగడపకు నిధులతో ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ పద్మజ, ప్రజాప్రతినిధులకు సూచించారు.

గడప గడపకు పూర్తి

పిచ్చాటూరు గడపగడప కార్యక్రమంతో నియోజకవర్గం మొత్తం పూర్తయినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కేవీ చలపతిరాజు(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రెడ్డి, రమేష్ రాజు, మోహన్ రెడ్డి, సర్పంచ్‌లు అన్నాదురై, రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బేబి, శోభన్‌బాబు, రామగిరి ఆలయ చైర్మన్ కేఎల్ వెంకటేశ్వర్లు, పళ్లికొండేశ్వరాలయ బోర్డు సభ్యులు ఎస్‌ఎం సురేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పథకాలే నన్ను బతికిస్తున్నాయి

శేషంపేటలో ఉదయం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళ భావోద్వేగానికి గురైంది. ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి బొట్టు పెట్టిన ఆమె తనకు ఎవరు దిక్కు లేదని.. జగనన్న ఇచ్చే పథకాలే బతికిస్తున్నాయని ఆనంద భాష్పాలతో ఎమ్మెల్యే చేతికి ముద్దు పెట్టి, కృతజ్ఞతలు తెలిపింది. తనలాంటి వారిని ఆదుకుంటున్న జగన్‌మోహన్ రెడ్డి నూరేళ్లు చల్లంగుండాలని పేర్కొంది.

వైభవంగా ప్రదోష పూజలు



ప్రాకారోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో త్రయోదశి సందర్భంగా శనివారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. నందీశ్వరుడికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి దీపధూప నైవేద్యాలు సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఓం నమఃశివాయ నామస్మరణలు మిన్నంటాయి. ప్రదోష పూజలకు, దేవతమూర్తులకు పుష్పాలంకరణకు ఉభయదాతగా శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్న రెడ్డి వ్యవహరించారు. ఆలయ చైర్మెన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఆయనకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్‌ఎం సురేష్, ఎస్.మునివేలు, జి.మంజుల, ఎస్.మంజుల, ఉమాపతి పాల్గొన్నారు.

సభలను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

ఏర్పేడు: శ్రీకాళహస్తిలో ఈనెల 17,18,19 తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపేట సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద హమాలీలతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సభల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, హమాలీలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ శ్రీకాళహస్తి నియోజక వర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, మణి, మహేంద్ర, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నాడు–నేడుతో అంగన్‌వాడీలకు మహర్దశ

- జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్
- 84 కేంద్రాలకు నిధుల మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

శ్రీకాళహస్తి: నాడు–నేడు పథకంతో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ వచ్చిందని డీఈఓ శేఖర్ తెలిపారు. శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 84 అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు ఫేస్–2 కింద నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, పెయింటింగ్ వంటి అవసరాలకు ఖర్చు పెట్టనున్నారు. ఎంపికైన 84 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఖాతాలు తెరవడం, గ్రామకమిటీలు, పేరెంట్స్ కమిటీల ఏర్పాటు, ఖాతా పుస్తకం ప్రారంభించడం, తీర్మానం పుస్తకం నిర్వహణ, నగదు పుస్తకం నిర్వహణ, ఇతర విషయాలపై శిక్షణ ఇచ్చారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఇరిగేషన్ ఏఈ రాఘవేంద్రరావు, ఎంఈవో బాలయ్య, సీడీపీవో శాంతి దుర్గ, సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్సిడీకి నేతన్నల దరఖాస్తు



విద్యుత్‌శాఖ ఏడీఈకి దరఖాస్తులు అందజేస్తున్న చేనేత కార్మికులు

వరదయ్యపాళెం: చేనేత మగ్గాల ద్వారా ఉపాధి పొందుతున్న నేతన్నలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 100 యూనిట్ల విద్యుత్ సబ్సిడీకి దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని 147 మంది చేనేత కార్మికులు విద్యుత్ సబ్సిడీ కోసం మండల విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ వద్ద దరఖాస్తు చేసుకున్నారు. నాగలాపురం ఏడీఈ చంద్రా నాయక్, ఏఈ శివప్రసాద్‌కు చేనేతల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి మగ్గం నిర్వాహకుడికి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డైరెక్టర్ తిలక్‌బాబు మాట్లాడుతూ.. ఇప్పటికే నేతన్న నేస్తం ద్వారా చేనేత కార్మికులకు రూ. 24వేలు నగదు సాయం అందిందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత కార్మికులను ఆదుకున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మీడియా సలహాదారు గుత్తి త్యాగరాజు, సచివాలయ కన్వీనర్ బీవీ రమేష్, చేనేత కార్మిక యూనియన్ నాయకులు జక్కల మునస్వామి, మాచర్ల శేఖరయ్య, వెంకటరమణయ్య, బుర్రా కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పెన్నగడంలో ముగ్గురిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం తెలిపారు. పెన్నగడం గ్రామానికి చెందిన నాగరాణి, భర్త లోకేష్, బావ సుధాకర్‌రెడ్డిపై డబ్బు వివాదపై అదే గ్రామానికి చెందిన పూజారి మునిబాబు, పూజారి బత్తిరెడ్డి దాడిచేసి గాయపరచినట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

క్రమశిక్షణే కుటుంబ వ్యవస్థకు గీటురాయి



మాట్లాడుతున్న ఉదయ్ కుమార్ రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): క్రమశిక్షణ కలిగిన కుటుంబ వ్యవస్థతోనే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని న్యాయవాది ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి ఎస్టీకాలనీలో శనివారం ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్, ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళల హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు విద్యావంతులైనప్పుడే సమాజంలో రుగ్మతలు దూరమవుతాయని తెలిపారు. కుటుంబ వ్యవస్థల బలోపేతానికి న్యాయవాదులుగా అవసరమైన సలహాలు అం దించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, సభ్యులు పుష్పలత, సురేష్, ఎస్‌వోఎస్ కోఆర్డినేటర్ జీనత్, యానిమేటర్ కాటమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

యువత, మహిళలకు నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం కోకోకోలా పరిశ్రమ భాగస్వామ్యంతో యువత, మహిళలకు నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణకు శ్రీకారంచుట్టారు. ఇందుకు పూణేకు చెందిన వై4డి స్వచ్ఛంద సంస్థతో కలిసి మూడు విభాగాల్లో మహిళలు, యువతకు శిక్షణ ఇస్తారు. డిజిటల్ లిటరసీ ఫర్ ఉమెన్, మార్కెటింగ్ అండ్ సేల్స్, క్లస్టర్ డెవలప్‌మెంట్ విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఉంటుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలుఈ నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి,కోకో కోలా పరిశ్రమ ప్రతినిధి శ్యామ్‌ప్రసాద్, వై4డి ప్రతినిధి సుయోగ్ కిర్వి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, అధ్యాపకులు పాల్గొన్నారు.